

మేధస్సు పెంపునకు నాంది

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్షలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

8 లో



కాలువలోకి దూసుకుపోయిన కారు

రాజవరం - పొదలాడ రోడ్డులో ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద ఆదివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది.

9,745 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

క్రీడలకు అధిక ప్రాధాన్యం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

రాజానగరం: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీని ఆదివారం సందర్శించిన ఆయన.. ఖేలో ఇండియా నిధులతో క్రీడా ప్రాంగణంలో చేపట్టిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పరిశీలించారు. 2022 మార్చిలో ప్రారంభమైన ఈ పనులు గత ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉందని, కానీ కాంట్రాక్టర్ అలసత్వంతో తీవ్ర జాప్యం జరిగిందని అన్నారు. అందువల్లనే తాను వస్తున్నానని తెలిసి కూడా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడన్నారు. ఇటువంటి వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో కూడా సరైన క్రీడా సదుపాయాలు లేవని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, యూనివర్సిటీ ఇంజినీర్ కె.నూకరత్నం, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగింది. తొలుత జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయుల ఆర్థికేతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంబంధమైన డీఏ బకాయిలు, పీఆర్‌సీ ఎరియర్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే హైస్కూల్ ప్లస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పల్ల రాజారావు, ప్రధాన కార్యదర్శిగా యర్ర ఆగ్నేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐవీ రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెక్కలతో జీవితంలో ఎదుగుదల



కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: లెక్కల్లో పురోగతి సాధిస్తే జీవితంలో చక్కగా ఎదుగుతారని, దీనికి గణితోపాధ్యాయుల సహకారం చాలా అవసరమని ఏపీ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ (జేడీ సర్వీసెస్) ఎస్.అబ్రహం అన్నారు. ఆ దిశగా మరింతగా మాథ్స్ టీచర్స్ ఫోరం కృషి చేయాలని సూచించారు. స్థానిక శ్రీ సత్యసాయి గురుకులంలో ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం ఆదివారం నిర్వహించిన జాతీయ మ్యాథ్స్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి అబ్రహం పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ, గణితోపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారని, కొన్ని స్కూళ్లలో గణితం చిట్కాలు ప్రత్యేకంగా చెబుతున్నారని అన్నారు. ఏపీ మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రంగోలీ పోటీలు, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్ ప్రోగ్రాంలలో టీచర్లందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఫోరం మహిళా కన్వీనర్ మేకా సుసత్యరేఖ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 500 మంది టీచర్లు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గురయ్య, ఫోరం ప్రధాన కార్యదర్శి గంగులపూడి భాస్కర్, అడ్వైజరీ మెంబర్ అట్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిరసావహించండి

- హెల్మెట్‌తో తలకు చక్కని రక్షణ
- ధరించకుంటే ప్రాణాలకే ప్రమాదం
- ఈ ఏడాది 91 మంది మృతి
- నిర్లక్ష్యంపై హైకోర్టు సీరియస్
- ద్విచక్రవాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాం...చి స్పీడ్ బైక్ ఎక్కి.. మెలికలు తిప్పుకుంటూ.. రోడ్డు మీద రివ్వుమంటూ వంద కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నప్పుడు మజాగానే ఉంటుంది. కానీ.. 'నాకేమవుతుందిలే' అనే చిన్నపాటి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే.. ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. అదే కనుక జరిగితే తనకే కాదు.. తన కుటుంబానికి సైతం ఎప్పటికీ తీరని విషాదమే మిగలవచ్చు. అందుకే ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించేలా చూడాలని.. 'తల'కెక్కించుకోకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని సాక్షాత్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమే ఇటీవల ఆదేశించింది.



రాజమహేంద్రవరం రూరల్: రోడ్లపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న కొంత మంది నిర్లక్ష్యానికి కేరాఫ్ అన్నట్టుగా ఉంటున్నారు. ఎంతమంది ఎన్నిసార్లు చెబుతున్నా హెల్మెట్ పెట్టుకోకుండా రయ్..మంటూ దూసుకుపోతున్నారు. అంతా సవ్యంగా సాగిపోయినప్పుడు ఏ ఇబ్బందీ ఉండదు. కానీ, ఊహించని విధంగా ప్రమాదానికి గురైతే.. రోడ్డుకు తల తగిలితే వారి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో జరిగిన 90 ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో కేవలం హెల్మెట్ ధరించనందువల్లనే తలకు తీవ్ర గాయాలై, ఏకంగా 91 మంది చోదకులు మృతి చెందారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పుతుందని తెలిసినా చాలా మంది పట్టించుకోవడం లేదు. పైగా శిరస్త్రాణం ధరించడాన్ని భద్రతగా కాకుండా భారంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకే ద్విచక్ర వాహనాలు నడిపేవారితో పాటు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు, అధికారులు పదేపదే చెబుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తుందని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలతో..

ద్విచక్ర వాహనదారుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు 1988లో మోటారు వాహన చట్టం కింద కేంద్ర ప్రభుత్వం 2019లోనే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ నిబంధన తీసుకుని వచ్చింది. 2010లో ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు దిచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ పెట్టుకోవాలని స్పష్టం చేసింది. అయితే, ఎన్నిసార్లు చెప్పినా హెల్మెట్ పెట్టుకోవడంపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోలీసులు ఈ నిబంధన అమలును పెద్దగా పట్టించుకోవడం లేదన్న వాదనలు ఉన్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా మోటారు వాహన చట్టం సక్రమంగా అమలు కాక, ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోందని గతంలో ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇటీవల మన రాష్ట్ర హైకోర్టులో ఓ న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ద్విచక్ర వాహనాలు నడిపే వారు, వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పక్కా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. మోటార్ వాహన చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే సందేశాన్ని వాహనదారులందరికీ తెలియజేయాలని స్పష్టం చేసింది. హెల్మెట్ ధరించని వారికి అక్కడికక్కడే జరిమానాలు విధించాలని, వాటిని చెల్లించకుంటే 90 రోజుల్లోగా ఆ వాహనాన్ని జప్తు చేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారాన్ని ఎంత మాత్రం తేలికగా తీసుకోవద్దని పేర్కొంది.



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జూనియర్ న్యాయవాదులకు హెల్మెట్‌లు పంపిణీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత (ఫైల్)

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన

రోడ్డు ప్రమాదాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు పేద విద్యార్థులకు, జూనియర్ న్యాయవాదులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన ర్యాలీ సైతం నిర్వహించారు. హెల్మెట్ ధరించడంపై జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆధ్వర్యాన అన్ని పోలీస్ స్టేషన్లలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు.

హెల్మెట్ తప్పనిసరి



జిల్లా పరిధిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించడంపై ఇప్పటికే జిల్లాలో ర్యాలీలు, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం. రోడ్డు ప్రమాదాల్లో అధిక మరణాలకు హెల్మెట్ ధరించకపోవడమే కారణం. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు, ప్రభుత్వ సూచనలతో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, జరిమానా విధిస్తాం.

– డి.నరసింహ కిషోర్, జిల్లా ఎస్పీ, తూర్పు గోదావరి

నాసిరకం వద్దు

ప్రజల అవసరాల రీత్యా బైక్‌ల వినియోగం పెరిగింది. ప్రజలు అధునాతన హంగులతో కూడిన ద్విచక్ర వాహనాలను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. అయితే జీవితానికి అత్యంత భద్రత కల్పించే హెల్మెట్ విషయంలో మాత్రం అశ్రద్ధ చూపుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కడ దెబ్బలు తగిలినా ప్రాణాలకు దాదాపు ముప్పు ఉండకపోవచ్చు. కానీ తలకు తగిలితే మాత్రం క్షణాల్లోనే ప్రాణం పోయే అవకాశం ఉంటుంది. పోలీసులకు భయపడో.. తక్కువ ధరకు దొరుకుతున్నాయనే ఉద్దేశంతోనే కొంత మంది రోడ్ల పక్కన విక్రయించే నాసిరకం హెల్మెట్లు కొనుగోలు చేస్తున్నారు. అయితే, అవి ప్రమాద సమయంలో వాహనచోదకులను ఏమాత్రం కాపాడలేవనే విషయం పరిశీలనల్లో తేలింది. అందువలన నాణ్యమైన హెల్మెట్లే వాడాలని అధికారులు సూచిస్తున్నారు. బీఐఎస్ స్టాండర్డ్ ప్రకారం తయారు చేసిన హెల్మెట్లలో సాగే తత్వం కలిగిన పాలిస్టర్ వినియోగిస్తారు. దీని వలన ప్రమాదం జరిగినప్పుడు తలకు దెబ్బ తగలకుండా రక్షణ లభిస్తుంది. అలాగే, ప్రమాద తీవ్రతను కూడా ఇది తగ్గిస్తుంది.

43 వేల మందికి జరిమానా

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం నడుం బిగించింది. సోషల్ మీడియా వేదికగా హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తోంది. మరోవైపు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటున్నారు. హెల్మెట్ ధరించని వారిపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో హెల్మెట్ ధరించని 43 వేల మందికి జరిమానా విధించారు. హెల్మెట్ ధరించకపోవడంతో పాటు మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణం, ఎదుటి వాహనచోదకులను గమనించకపోవడం వంటి అంశాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విషయాన్ని గమనించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

పవన్ కల్యాణ్ ప్రగల్భాలు ఆపాలి

- మన్యంలో నేటికీ డోలీ మోతలే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెద్దాపురం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగల్భాలు పలకడం ఆపాలని, మన్యం పర్యటన పేరుతో డాంబికాలు మినహా ఆయన వల్ల, రాష్ట్ర ప్రభుత్వం వల్ల గిరిపుత్రులకు ఒరిగేదేమి లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం జిల్లా మహాసభల్లో పాల్గొన్న ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డోలీ మోతలపై చర్యలు తీసుకుంటామని నాలుగు నెలల క్రితం ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలియదా అని ప్రశ్నించారు.

గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నెలకో రోజు మన్యం వెళ్లి ఉంటానని, డోలీ మోతలు లేని ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ప్రకటించారన్నారు. కానీ, ఇప్పటికీ మన్యంలో డోలీ మోతలు మినహా కాస్తంత అభివృద్ధి అయినా జరగలేదని అన్నారు. వైద్యం, విద్యా హక్కులతో పాటు ఆదివాసీలకు కీలకమైన భూ సమస్యను పవన్ కల్యాణ్ విస్మరించారన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మన్యంలో గ్రామసభల అనుమతులు లేకుండా మైనింగ్, జలవిద్యుత్ ప్రాజెక్టులకు, అదానీ కంపెనీలకు భూములను ధారాదత్తం చేసే విధానాలను పవన్ కల్యాణ్ వ్యతిరేకిస్తారా అని ప్రశ్నించారు, తప్పుడు విద్యుత్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలు వేసిన కూటమి ప్రభుత్వం మరోసారి భారాలు మోపేందుకు సిద్ధంగా ఉందని దుయ్యబట్టారు. మీరు వేసే విద్యుత్ భారాలను ప్రజలు ఎందుకు భరించాలని ఆయన ప్రశ్నించారు.

పంట భూముల్లో ఎయిర్‌పోర్టు వద్దు

కాకినాడ సెజ్‌లో సుమారు 650 ఎకరాల ప్రభుత్వ భూమి నేటికీ ఖాళీగా ఉందని, వాటిలో పరిశ్రమలు పెట్టవచ్చని, అటువంటి చర్యలను ప్రభుత్వం ఎందుకు చేపట్టడం లేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. అన్నవరం వద్ద మూడు పంటలు పుష్కలంగా పండే భూములను విమానాశ్రయం కోసం రైతుల వద్ద తీసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి ప్రయత్నాలు విరమించుకుని, పంటలు పండని సాల్ట్ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. తమ భవిష్యత్ దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చేస్తున్న చోట భూములు ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పంటలు పండే భూమిని రైతుల అనుమతి లేకుండా తీసుకునే వీలు లేదని స్పష్టం చేశారు. రైతులకు అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వచ్చే విధంగా పరిశ్రమలు తీసుకురావాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్, నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో ఉదయం నుంచే భక్తుల రద్దీ ఆరంభమైంది. సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధువులు, ఇతర భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

కన్నుల పండువగా రథోత్సవం

ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. ఆ రథంపై స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వేంచేయించి, పూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు రథోత్సవాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథోత్సవం నిర్వహించారు.



సత్యదేవుని దర్శించేందుకు క్యూ కట్టిన భక్తులు

తెగుళ్ల పొగ

- నల్లకాడ తెగులు సోకి చనిపోతున్న మొక్కలు
- తోటలు దున్ని మరలా వేయాల్సిన దుస్థితి
- ఎకరాకు రూ.50 వేల నష్టం
- పొగాకు రైతుల ఆందోళన

దేవరపల్లి: వర్జీనియా పొగాకు తోటలకు పలు రకాల తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటలు వేసి దాదాపు నెల రోజులు దాటడంతో ఆశాజనకంగా ఉన్నాయని వారు ఆనందిస్తున్న తరుణంలో.. పలు గ్రామాల్లో తోటలకు నల్లకాడ, ఆకుముడత వంటి తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఈ తెగుళ్లు సోకిన మొక్కలు మొదలు కుళ్లిపోయి చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈవిధమైన తెగుళ్ల బారిన పడిన తోటలు కోలుకోవడం కష్టమని అధికారులు అంటున్నారు. ఎక్కువ శాతం మొక్కలకు తెగుళ్లు సోకితే దున్నివేసి మరలా వేయడం మంచిదని సూచిస్తున్నారు. ఈమేరకు పలు గ్రామాల్లో రైతులు ఇప్పటికే వేసిన తోటలను దున్నేసి, మళ్లీ నాట్లు వేస్తున్నారు. దీనివలన ఎకరాకు సుమారు రూ.50 వేల నష్టం వస్తోందని వారు వాపోతున్నారు. దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో పొగాకు తోటలకు ఈ తెగుళ్లు సోకాయి. గోపాలపురం వేలం కేంద్రం పరిధిలోని వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల్లో ఈ తెగుళ్లు విజృంభించాయి. దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలో చిన్నాయగూడెం, సంగాయగూడెం, కృష్ణంపాలెం, బందపురం, దేవరపల్లి, యర్నగూడెం గ్రామాల్లో నల్లకాడ, ఆకుముడత తెగుళ్లు సోకాయని రైతులు చెబుతున్నారు. అయితే వీటి ఉధృతి తక్కువగా ఉందని వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత తెలిపారు. తెగుళ్లు సోకిన మొక్కలను తొలగించి కొత్త మొక్కలు వేసుకోవాలని ఆమె తెలిపారు. వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల్లో తెగుళ్లు సోకిన తోటలను ఇటీవల సీటీఆర్ఐ, ఐటీసీ శాస్త్రవేత్తలు, బోర్డు అధికారులు పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు.

వాతావరణ మార్పులతో..

ఊహించని విధంగా వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా పొగాకు తోటలకు తెగుళ్లు సోకాయని అధికారులు చెబుతున్నారు. రెండు వారాలుగా చలిగాలుల తీవ్రత పెరిగింది. ఇదే సమయంలో మబ్బులతో కూడిన జల్లులు పడుతున్నాయి. ఇటువంటి వాతావరణం వల్లనే తోటలు తెగుళ్ల బారిన పడ్డాయని బోర్డు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి పొగాకు తోటలకు మబ్బుల వాతావరణం అనుకూలం కాదు. 22 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ ఉష్ణోగ్రత ఉండరాదు. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొనడంతో పొగాకు తోటలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి.

నల్లకాడ తెగులు లక్షణాలు

నల్లకాడ తెగులు మట్టి ద్వారా ఫైటోప్థోరా అనే శిలీంద్రం వలన వస్తుంది. ఇది నారుమడిలో మాను మచ్చ (లీఫ్ బ్లైట్) గాను, ప్రధాన పంటలో నల్లకాడ (బ్లాక్‌షాంక్) గాను ప్రవర్ధనం చెందుతుంది. మేఘావృతమైన ఆకాశం, చెమ్మ వాతావరణం, చిత్తడి నేలలు, 22 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ ఉష్ణోగ్రత ఉంటే ఈ తెగులు ఆశించి, విస్తరిస్తుంది. ఇది నాలుగు వారాల నారుకు అధికంగా సోకుతుంది. ముందు సంవత్సరం తెగులు సోకిన ప్రదేశంలో మళ్లీ నారుమడి కట్టినా ఈ తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. ఆకులపై కమిలినట్టు పెద్ద మచ్చలు (నీటిలో నానిన దూది మాదిరిగా) కనిపించడం వలన దీనిని ఆకుమచ్చ అని కూడా పిలుస్తారు. ఈ మచ్చలు పెద్దవై మొత్తం మొక్కకు విస్తరిస్తాయి. దీనివలన ఆకు కణజాలం, ఈనెలు, వేర్లు, క్రమేపీ మొక్క ఆసాంతం కుళ్లిపోతుంది.



దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలో నల్లకాడ తెగులు సోకి చనిపోతున్న పొగాకు మొక్కలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



తెగుళ్లు సోకిన పొగాకు తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి. తరచూ తెగులు ఆశించే తోటల్లో పంట మార్పిడి పాటించాలి. మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలి. తేమ అధికంగా ఉన్నప్పుడు నీటి తడులు ఇవ్వడాన్ని నియంత్రించాలి. ప్రస్తుతం తెగుళ్ల ఉధృతి తక్కువగానే ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల నల్లకాడ, ఆకుముడత తెగుళ్లు అక్కడక్కడ వ్యాపించాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. బోదెల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను తొలగించి, కొత్తవి వేసుకోవాలి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్, రాజమహేంద్రవరం

కిక్కిరిసిన అయినవిల్లి



స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు చేశారు. మహానివేదన అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 25 మంది, లక్ష్మీగణపతి హోమంలో 21 మంది, పంచామృతాభిషేకాల్లో ఇరువురు దంపతులు పాల్గొన్నారు. 15 మంది చిన్నారులకు నామకరణ, అక్షరాభ్యాసాలు, తులాభారం జరిపారు. 26 మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. అన్నదాన పథకంలో 2,150 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,10,185 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 - 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 - 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



ధర్మవరంలో ఎలక్ట్రిక్ బైక్ నుంచి వస్తున్న పొగలు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైంది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన దేవరపల్లి సత్యనారాయణకు చెందిన ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ బైక్‌పై ధర్మవరానికి చెందిన ఎం.భావనా రుషి ప్రత్తిపాడు వస్తున్నారు. ఈలోగా బైక్ నుంచి పొగలు రావడంతో బైక్ నిలుపుదల చేశారు. ఈ లోపు స్థానికులు ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కేఎస్ఎన్ మూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామానికి చెందిన గొందాల సూర్యనారాయణ (73) శనివారం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. విశాఖపట్నం వైపు వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు.

మేధస్సు పెంపునకు నాంది

- ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్ష
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు
- పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా ఉందన్న తల్లిదండ్రులు





'సాక్షి' స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2024-25

మధురపూడి: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్షలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కోరుకొండ మండలం లారల్ హై గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హాజరయ్యారు. చలి తీవ్రంగా ఉన్నా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు తరలి వచ్చారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధించడానికి అవకాశం ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు. 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగింది. దీనిని నాలుగు కేటగిరీల్లో నిర్వహించగా, 600 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

కేటగిరీలుగా విభజించి..

కేటగిరి-1లో 1, 2, 3, 4 తరగతులకు చెందిన విద్యార్థులు, కేటగిరీ-2లో 3, 4 తరగతులు, కేటగిరీ-3లో 5, 6, 7 తరగతులు, కేటగిరీ-4లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్తేజం తీసుకు రావడానికి అవకాశం ఏర్పడుతోందని అన్నారు. స్పెల్‌బీ నిర్వహించిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను లారల్ హైగ్లోబల్ స్కూల్ డైరెక్టర్, సుంకర రవికుమార్, 'సాక్షి' రీజనల్ మేనేజర్ (అడ్మిన్) ఎస్.రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) కె.ఉమాశంకర్ పర్యవేక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్పెల్ బీకి డ్యూక్స్ వేఫీస్ మెయిన్ స్పాన్సరర్‌గా, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (రాజమహేంద్రవరం) అసోసియేట్ స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్నాయి. లారల్ హైగ్లోబల్ పాఠశాల సహకారం అందించింది.

ఇంగ్లిష్ అంటే భయం పోయింది



'సాక్షి' స్పెల్ బీ పరీక్ష రాయడం ద్వారా ఇంగ్లిష్ భాష అంటే భయం పోయింది. పలకడం, రాయడం సులభతరం అయ్యింది. ఇక నుంచి సులభంగా ఇంగ్లిషులో రాణించడానికి అవకాశం ఏర్పడింది. ఈ పరీక్ష రాయడంతో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.

– మీనాక్షి హరిప్రియ, 2వ తరగతి, ఆదిత్య అకాడమీ, శ్రీనగర్, కాకినాడ

ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు



'సాక్షి' నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి ఉపయోగపడుతుంది. ఇంగ్లిష్‌లో చాలా ప్రధానమైన స్పెల్లింగ్, వ్యాకరణంపై సంపూర్ణ పట్టు వస్తోంది. తద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతోంది. పోటీ పరీక్షల్లో రాణించడానికి దోహదపడుతోంది.

– సుంకర రవికుమార్, డైరెక్టర్, లారల్ హై గ్లోబల్ పాఠశాల, గాడాల.

నైపుణ్యం పెరుగుతోంది



ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతోంది. పిల్లలు ఇంప్రూవ్ కావడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ పరీక్ష రాయడంతో ఇంగ్లిష్ భాషా నైపుణ్యం సాధించడానికి అవకాశం ఏర్పడింది. విద్యార్థుల మంచి భవిష్యత్‌కు, విదేశాల్లో ఉన్నత చదువుకు వెళ్లడానికి వీలవుతుంది.

– పద్మజ నయన, విద్యార్థి తల్లి, కాకినాడ

భవిష్యత్తుకు నిర్దేశంగా..



విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడానికి 'సాక్షి' స్పెల్ బీ పరీక్ష ఉపయోగపడుతుంది. ఇంగ్లిష్ భాషంటే భయం దూరం చేస్తోంది. పోటీతత్వం అలవర్చుతుంది. ఇంగ్లిష్‌లో ఒకాబ్యులరీ చాలా ముఖ్యమైంది. దీనిపై అవగాహన పెరుగుతుంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

– అశోక్, పేరెంట్, దంత వైద్యుడు, జీఎస్ఎల్, రాజమహేంద్రవరం

చాలా విషయాలు తెలుసుకున్నా..



'సాక్షి' స్పెల్ బీ పరీక్ష రాయడం ఆనందంగా ఉంది. మేధస్సు పదును పెట్టేలా దీనిని నిర్వహించారు. ఇంగ్లిషు భాషపై సంపూర్ణ అవగాహన ఏర్పడింది. పోటీ పరీక్షలంటే భయం పోయింది. స్పెల్లింగ్, వ్యాకరణంలో చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇది నా భవిష్యత్‌కు బాటలు వేస్తుంది.

– మరోతు లలిత, 6వ తరగతి, ట్రిప్ ఇంటర్నేషనల్, రాజమహేంద్రవరం

ఒకాబ్యులరీపై మంచి అవగాహన



ఇంగ్లిష భాషలో ఒకాబ్యులరీ పట్ల సంపూర్ణ అవగాహన ముఖ్యం. ఇది 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ద్వారా అవగతం చేసుకున్నాను. పరీక్ష ద్వారా ప్రాక్టీసు అయ్యాను. స్పెల్లింగ్, వర్డ్స్ పట్ల అవగాహన కలిగింది. ఇది ఉపయుక్తంగా ఉంది.

– నిషాంత్ పట్నాలు, 7వ తరగతి, లారల్ హైగ్లోబల్ స్కూల్, గాడాల

విదేశీ విద్యకు ఉపయుక్తం



విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష బాట వేస్తోంది. ఇంగ్లిష్‌లో స్పెల్లింగ్, ఒకాబ్యులరీ చాలా ముఖ్యం. దీనిని నేర్చుకోవడానికి ఈ పరీక్ష దోహదపడుతోంది. పరీక్ష బాగా రాశాను. దీనివల్ల ఎంతో ఉత్సాహం వచ్చింది. విదేశాలకు వెళ్లాలనే నా కోరికను నెరవేరుతోందని ఆశిస్తున్నాను.

– కె.సరోజరెడ్డి, 7వ తరగతి, ప్రతిభ స్కూల్, జంగారెడ్డిగూడెం

రాణించేందుకు మంచి అవకాశం



విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేలా 'సాక్షి' స్పెల్ బీ పరీక్ష ఉంది. పోటీ పరీక్షల్లో రాణించడానికి ఇదో మంచి మార్గం. ఈ పరీక్షతో అనేక అంశాలు తెలుసుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే అనేక పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపడానికి మార్గం సుగమమైంది.

– అదిమూలం దేవి, 9వ తరగతి, ఆదిత్య, అమలాపురం

ముగిసిన రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. తొలుత మ్యాచ్‌లను మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రమణ, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్‌లు అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ క్రీడలు మానవ మేధస్సును ఉత్తేజంచేసి, దేహాన్ని పటిష్టపరుస్తుందన్నారు. చదువులో కలిగే ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు, పట్టుదల అలవడతాయన్నారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, టేబుల్ టెన్నిస్ సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, అధ్యక్షుడు భాస్కర్‌రామ్, కార్యదర్శి మోహన్‌బాబు, శ్రీప్రకాష్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, పెద్దాపురం, కాకినాడ శాఖల ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



టీటీ పోటీల విజేతతో ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్ తదితరులు

కాలువలోకి దూసుకుపోయిన కారు

- యువకుడిని రక్షించిన స్థానికులు
- 12 రోజుల వ్యవధిలో రెండో ప్రమాదం

పి.గన్నవరం: రాజవరం – పొదలాడ రోడ్డులో ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద ఆదివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న కారు నుంచి డ్రైవర్‌ను స్థానిక యువకులు రక్షించారు. ఈ నెల 10వ తేదీ తెల్లవారు జామున ఇదే ప్రాంతంలో కాలువలోకి కారు దూసుకుపోయిన ప్రమాదంలో పోతవరం గ్రామానికి చెందిన తల్లీ, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంఘటన మరువక ముందే.. సరిగ్గా అక్కడే మరో ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు పోచనపెద్ది సాయి ఆదివారం ఉదయం కారులో రావులపాలెం వచ్చాడు. అక్కడి నుంచి కడలి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. చింతావారిపేటకు వచ్చే సరికి ఆ కారు అదుపు తప్పి రోడ్డు వెంబడి ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. దీంతో కారు ముందు భాగం నీట మునిగి ప్రవాహానికి కొట్టుకుపోతోంది. ఆ యువకుడు కారు డిక్కీని ఓపెన్ చేసి వెనుక సీట్లో నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. దీనిని గమనించిన స్థానిక యువకులు హుటాహుటిన కాలువలోకి దిగి కారులో ఉన్న యువకుడిని రక్షించారు. కారును తాళ్లతో స్తంభానికి కట్టారు. రోడ్డుపై ఉన్న రాయిని ముందు టైరు ఎక్కడంతో కారు అదుపు తప్పిందని సాయి చెప్పాడు. అతడు సురక్షితంగా బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్‌పీ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువ వైపు రెయిలింగ్స్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



కారు నుంచి యువకుడిని రక్షిస్తున్న స్థానికులు

అక్కడే మరో ప్రమాదం

పంట కాలువలో కారు ప్రమాద సంఘటనను తిలకిస్తూ.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొని ఒక మోటారు సైక్లిస్టు తీవ్ర గాయాల పాలయ్యాడు. కైకరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, బాలుడు కలిసి మోటారు సైకిల్‌పై పి.గన్నవరం వైపు వస్తున్నారు. చింతావారిపేట వద్ద కారు ప్రమాద సంఘటనను వారు చూస్తూ ముందు వెళ్తున్న మరో మోటారు సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో కైకరం గ్రామానికి చెందిన వ్యక్తి తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోటారు సైకిల్ వెనుక కూర్చుని ఉన్న బాలుడు సురక్షితంగా బయటపడ్డాడు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.



బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

సాయం చేసి గెలిపించండి

ఓ క్రీడాకారుడి వేడుకోలు

తాళ్లపూడి: ఆట అతని ముందుకు తీసుకెళ్తుంటే.. ఆర్థిక భారం వెనక్కి నెట్టేస్తోంది.. సాయం కోసం ఆ క్రీడాకారుడు వేచిచూడాల్సి పరిస్థితి ఎదురైంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కొండే అనిల్‌కుమార్‌కు చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ప్రాణం. అదే అతన్ని ఆ క్రీడల్లో ప్రతిభ చాటేలా చేసింది. ఇదిలా ఉంటే పేదరికం కారణంగా ఆర్థిక వనరులు లేక ఇబ్బంది పడుతున్నాడు. ప్రస్తుతం ప్రతిష్టాత్మక ఇండో నేపాల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ సిరీస్‌లో ఆడే అవకాశం తూర్పుగోదావరి జిల్లా నుంచి కొండే అనిల్‌కుమార్‌కు దక్కింది. ఈ నెల 30 నుంచి జనవరి 1 వరకూ జరిగే ఈ క్రికెట్ సిరీస్‌కు హాజరయ్యేందుకు రూ. 3 లక్షల వరకూ అవసరం అని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29న ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్ వెళ్లి టీమ్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతకాలను సాధించాడు. అయితే ఇండియా తరఫున ఆడేందుకు ఎంపికైన అనిల్ కుమార్‌కు ఏపీ టెన్నిస్ బాల్ అసోసియేషన్ నుంచి రూ. లక్ష సమకూరుస్తున్నారు. కాగా ఆర్థిక స్థోమత లేని అనిల్ మిగతా సాయానికి దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తిరుగుడుమెట్ట పాఠశాలలో పీఈటీగా ఆయన పనిచేస్తున్నారు. తనకు ఆర్థికంగా సహకారం అందిస్తే తప్పని సరిగా విజయం సాధించి రాష్ట్రం, జిల్లా, మండలం, సొంత గ్రామానికి మంచి పేరు తీసుకువస్తానని అంటున్నారు. నేషనల్ పోటీలకు ఎంపికైన అనిల్‌ను పలువురు అభినందించారు.



వివిధ టోర్నమెంట్లలో పతకాలు సాధించిన కొండే అనిల్‌కుమార్

వెళ్దాం లే.. సునీతా!

- భార్య మృతదేహం వద్ద భర్త కన్నీరు
- భార్యాభర్తల బంధాన్ని విడదీసిన రోడ్డు ప్రమాదం

ప్రత్తిపాడు: లే సునీత.. వెళ్దాం.. నీవు లేకపోతే నేనుండలేను అంటూ భార్య మృతదేహం వద్ద ఆ భర్త ఆక్రందన అందరినీ కలచివేసింది.. ఈ హృదయ విదారక ఘటన ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద జరిగింది. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఆనందనగర్‌కు చెందిన వరిగొండ రవికుమార్ పౌరోహిత్యం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆయన తన భార్య సునీత (45)తో కలసి స్కూటీపై ప్రత్తిపాడు వస్తున్నారు. వీరి వాహనాన్ని స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద లంపకలోవ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో సునీత తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రవికుమార్ ఏం జరిగిందో తెలియక కొంత సేపు అయోమయానికి గురయ్యాడు. అంతటి గాయాలైనా రోడ్డుపై పడి ఉన్న భార్య చెంతకు వెళ్లి లే సునీత..వెళ్దాం అని మాట్లాడడం అక్కడి వారిని కలచివేసింది. తీవ్ర గాయాల పాలైన రవికుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. సునీత మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సునీత మృతదేహం వద్ద భర్త రవికుమార్ రోదన



గాయపడిన రవికుమార్

తప్పెవరిది... శిక్షెవరికి!

- మేనేజర్ అవినీతి, అధికారుల నిర్లక్ష్యం
- పండగ వేళ జీజీహెచ్ ఉద్యోగులకు పస్తులు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో శాంక్షన్ పోస్టుల్లో చోటు చేసుకున్న అవినీతి వ్యవహారం వందల కుటుంబాల్ని పస్తులుండేలా చేస్తోంది. లేని పోస్టుల్ని సృష్టించి మరీ అమ్మేసిన ఘనకార్యంలో బాధ్యుడైన, నర్సింగ్ పోస్టుల అమ్మకాల్లో ఇప్పటికే సస్పెండైన ఆసుపత్రి మేనేజర్‌పై తదుపరి చర్యలకు అధికారులు పూనుకుంటుండగా, ఈ అవినీతి మాటున అమాయక ఉద్యోగులు బలైపోయారు. 2021 ఏడాది శాంక్షన్ పోస్టుల భర్తీ కేంద్రంగా జరిగిన ఈ అవినీతిలో 12 పోస్టులు లంచాలు పుచ్చుకొని అమ్మేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఇదే రిక్రూట్‌మెంట్‌లో నియమితులై పనిచేస్తున్న 190 మందిలో ఈ 12 మంది ఉన్నారన్న కారణంతో ఏకబికిన 190 మంది జీతాలూ నిలిపేశారు. ఇందులో 30 మంది కాంట్రాక్టు బేసిక్, 160 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. గత నెల జీతాలు ఈ నెల 1వ తేదీ నాటికే జమ కావాల్సి ఉంది. రెండో నెల పూర్తి కావొస్తున్నా నేటికీ జమ కాలేదు. ఉద్యోగుల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఇప్పటికే ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ బృందం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం కలెక్టర్‌ను కలసి జీతాలు విడుదల చేయాలని విన్నవించాలని నిర్ణయించారు. అయితే ఖజానా శాఖ అవరోహణ క్రమంలో ఉద్యోగుల జాబితా తయారు చేసి అనర్హులను వేరు చేసి ఇస్తే మిగిలిన వారికి జీతాల బిల్ పెడతామని తద్వారా జీతాల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పినా ఆసుపత్రి అధికారుల్లో మాత్రం స్పందన లేదు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆ మాత్రం జాబితాను తయారు చేయలేకపోయారు. ఈ విషయంపై కలెక్టర్ షణ్మోహన్‌ను వివరణ కోరగా తన వద్దకు నేటికీ జీతాల విడుదలకు సంబంధించి ఎటువంటి నోట్ ఫైల్ జీజీహెచ్ నుంచి రాలేదన్నారు.

నిరంతర కృషితో లక్ష్య సాధన

రాజమహేంద్రవరం రూరల్: దేశ వ్యాప్తంగా జరిగిన నీట్-2024 పరీక్షలో మంచి ర్యాంకులతో ఉత్తీర్ణులై 204 మంది విద్యార్థులు వివిధ మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించడం సంతోషదాయకమని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. తిరుమల రాజమహేంద్రవరం క్యాంపస్‌లో జరిగిన మెడ్‌సినాప్స్-2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ లక్ష్యాన్ని సాధించాలంటే నిరంతర కృషి, పట్టుదల కావాలన్నారు.

చెన్నై శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ కె.బాలాజీసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఎంతో నిబద్ధతతో పని చేయాలని, మీరందరూ రాబోయే కాలంలో డాక్టర్లుగా అందరికీ సేవ చేయాలని తెలిపారు. ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, పెద్దలతో గౌరవంగా మెలగాలన్నారు. కంటి వైద్య నిపుణుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ ఒకే క్యాంపస్ నుంచి 204 మంది డాక్టర్లను అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. నున్న కృషీధరరావు మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో రీసెర్చ్ పెరగాలని, సాంకేతికతను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం నున్న తిరుమలరావు వైద్యులచే విద్యార్థులకు స్టెతస్కోప్, షీల్డ్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సరోజినిదేవి, ప్రిన్సిపాల్ శ్రీహరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు